క్లుప్తంగా

శ్రీవారికి ఘనంగా నవనీత సేవ



వెన్నతో అలంకరించిన శ్రీవారి విగ్రహం

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతినోపేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామికి శనివారం వెన్నతో అలంకరించిన నవనీత సేవా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారికి అర్చకులు పురాణం శేషాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నవనీత విసర్జన, అభిషేకాలు నిర్వహించి వెన్న ప్రసాదాన్ని భక్తులకు అందిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కేఎస్ఎన్ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, వి.తాతాజీ పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయ పోటీలకు అనిల్ దంత వైద్య విద్యార్థిని



భువనేశ్వరి

తగరపువలస: జాతీయ తైక్వాండో పోటీలకు సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య విద్యార్థిని ఎల్వీ భువనేశ్వరి ఎంపికయ్యారు. అమృతసర్‌లోని గురునానక్ దేవ్ విశ్వ విద్యాలయంలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరగనున్న పోటీల్లో ఆమె పాల్గొననున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం తరఫున ఎంపికైన ఇద్దరు విద్యార్థుల్లో ఆమె ఒకరు. దంతవైద్య కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న భువనేశ్వరిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, యాజమాన్యం శనివారం అభినందించారు.

విశేషంగా ధనుర్మాస పూజలు

పద్మనాభం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కుంతీ మాధవ స్వామి ఆలయంలో 23వ రోజైన శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామిని తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో సుప్రభాత సేవతో మేల్కొలిపారు. తదుపరి విశేష అర్చన, పంచామృత అభిషేకాలు, నగర సంకీర్తన చేశారు. అనంతరం గోదాదేవి అష్ట దిక్పాలకులకు ఆవాహనం పలికారు. మంగళాశాసనంతో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా సొమ్ము అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట సచివాలయం పరిధిలో ఇటీవల మరణించిన మేకల పద్మకు వైఎస్సార్ బీమా మంజూరయింది. అందులో భాగంగా తక్షణ సాయంగా పద్మ సోదరుడు శ్రీనుకు పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు రూ.10వేలు శనివారం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దుంప సాయిరెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీలు శ్రీదేవి, డబ్బీరు సతీష్, వలంటీర్ రమణి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కొమ్మాది : జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇతర సమస్యలను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి మధురవాడ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల సమస్య వేధిస్తోందని, పరిష్కరించాలని కోరుతూ కాపులుప్పాడలో శనివారం వినతిపత్రం అందించారు.

మిక్సింగ్ వ్యర్థాలతో అధ్వానంగా రోడ్లు



మారికవలస - తిమ్మాపురం రోడ్డులో వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న ఓ వాహనం



సిమెంట్ వ్యర్థాలతో అధ్వానంగా మారిన వుడా కాలనీ - లా కాలేజీ రోడ్డు

- ఇష్టానుసారంగా సిమెంట్, కాంక్రీట్ వ్యర్థాల డంపింగ్
- మధురవాడలో రాకపోకలకు వాహనదారులకు అవస్థలు

మధురవాడ: అధికార యంత్రాంగం ఎన్ని రకాలుగా హెచ్చరిస్తున్నా కొందరు పట్టించుకోవడం లేదు. గృహ నిర్మాణ, సిమెంట్, కాంక్రీట్, ఇతర వ్యర్థాల డంపింగ్‌కి ప్రత్యేక ప్రదేశాలు నిర్దేశించినా వాటిని తరలించే వాహనాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మిశ్రమాలు రోడ్డుపై పడిపోతున్నాయి. మరికొన్ని చోట్ల ఇష్టానుసారంగా వ్యర్థాలు రోడ్డు పక్కనే డంపింగ్ చేయడంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. ఇదీ మధురవాడలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి.

నగరంలో మధురవాడ శరవేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతం కావడంతో సిమెంట్, కాంక్రీటు మిశ్రమం తయారు చేసి నిర్మాణదారులకు సరఫరా చేసే పరిశ్రమలు అధిక సంఖ్యలో వెలిశాయి. ఈ వాహనాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తడి మిశ్రమం రోడ్లపై అనేక చోట్ల జారిపడుతోంది. దీంతో అద్దం లాంటి రోడ్లు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన కొందరు అధికారుల ఉదాసీనతతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. వుడా కాలనీ - లా కాలేజీ మాస్టర్ ప్లాన్ రోడ్డు, మారికవలస - తిమ్మాపురం, ఓజోన్ వేలీ, ఐటీ సెజ్ తదితర శివారు ప్రాంతాల రోడ్లపై సిమెంట్, కాంక్రీట్ వ్యర్థాలు పడడం, రోడ్డు పక్కన ఇష్టానుసారంగా డంపింగ్‌తో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ప్రదీప్ కుమార్

మధురవాడ: జీవీఎంసీ జోన్ - 2 కేంద్రం మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో హాకర్స్ జోన్‌లు ఏర్పాటు చేయాలని వీధి వ్యాపారుల సంక్షేమ సేవా సంఘం నాయకుడు తాతపూడి ప్రదీప్ కుమార్ కోరారు. మధురవాడ జోనల్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి ప్రతిపాదనలు ఉన్నా హాకర్స్ జోన్ ఏర్పాటులో అధికారులు ఆలస్యం చేస్తున్నారన్నారు. దీంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయం జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. అనంతరం కొత్తగా బాధ్యతలు చేపట్టిన జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మిని కలిసి ఆమె దృష్టికి వీధి వ్యాపారుల సమస్యలు తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి భక్తుల తాకిడి



ఆకట్టుకున్న కోలాటం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక్కడకు వచ్చిన భక్తులకు కార్తీక దీపోత్సవం సభ్యులు ప్రసాదం అందజేశారు. సీతమ్మధారకు చెందిన సాయి కోలాటం గ్రూప్ నిర్వహించిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఏపీఎంటీఎఫ్ నూతన కార్యవర్గం



క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరిస్తున్న ఎంఈవో బాలామణి

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీఎంటీఎఫ్) నూతన కార్యవర్గం ఎన్నిక జిల్లా అధ్యక్షుడు పీవీ చందరరావు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. అధ్యక్షునిగా జి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ అమర్‌నాథ్, కోశాధికారిగా కె.లీలామణి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా వై.ప్రతాప్ సింగ్, ఎ.నైముద్దీన్, ఉపాధ్యక్షులుగా వైవీ రవికుమార్, ఎస్.జగదీష్, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఎం.మురళీకృష్ణ, పి.కిరణ్‌కుమార్, కె.ఇందిర ఎంపికయ్యారు. అలాగే మహిళా అధ్యక్షురాలిగా సీహెచ్.లావణ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీవీ లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వై.వెంకటేష్, టి.రామకృష్ణ, బి.బ్రాహ్మణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బాలామణి ఈ ఫెడరేషన్‌కు సంబంధించిన క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ - చెన్నై ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో నిర్వహించే హయ్యర్ హిందీ పరీక్షల ఫీజులు రూ.10 అపరాధ రుసుముతో ఈ నెల 10 వరకు చెల్లించడానికి అవకాశం కల్పించారు. రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలకు హాజరు కావాలనుకునే వారు 89856 47419లో సంప్రదించాలని ఆదర్శప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ఇటీవల సభ లోయర్ పరీక్షలకు కూడా రూ.10 అపరాధ రుసుముతో ఈ నెల 10వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు గడువు పెంచిన సంగతి తెలిసిందే.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలో నమూనా గురించి వివరిస్తున్న విజ్ఞాన్ విహార్ విద్యార్థులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త చంద్రశేఖర్

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన్ విహార్ విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులచే ఏర్పాటు చేసిన కళా వైజ్ఞానిక ప్రదర్శనలు వారి ప్రతిభకు అద్దం పట్టాయి. చిన్న వయసులో విద్యార్థులు చూపిన ప్రతిభను పలువురు కొనియాడారు. 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 241 మంది విద్యార్థులు సైన్స్‌లో 30, కళల విభాగంలో 30 నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలను ప్రారంభించిన ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త వైవీఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రఘు ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు కలిదిండి రఘు మాట్లాడుతూ చదవడమే కాకుండా చదివిన దానిని గుర్తు పెట్టుకోవడం ఎంతో ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బీవీకే అధ్యక్షుడు పెస్ అవధాని, దూసి రామకృష్ణారావు, పేరి రామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఓక్రిడ్జ్'లో ఘనంగా క్రీడోత్సవం



బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ క్రిస్టోఫర్ షార్ట్

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సాయంత్రం వార్షిక క్రీడోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ - ఇండియా రీజియన్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టోఫర్ షార్ట్ పాల్గొని బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి, వ్యాయామం జీవితాంతం అవసరమన్నారు. అన్ని పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ సందర్భంగా రంగు రంగుల దుస్తులతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు, వ్యాయామాలు, క్రీడలు ఉత్సాహభరితమైన వాతావరణంలో సాగాయి. ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ ఆరోగ్యం, టీమ్ స్పిరిట్, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నమ్మివానిపేటకు కరెంటు కష్టాలు

- సింగిల్ ఫేజ్ సరఫరాతో లో ఓల్టేజ్ సమస్య



నమ్మివానిపేటలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలస డివిజన్‌లోని నమ్మివానిపేట గ్రామాన్ని సింగిల్‌ఫేజ్ కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. భీమిలి, తగరపువలస పట్టణాలకు సమాన దూరంలో ఉన్న తమ గ్రామానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. 150 కుటుంబాలకు పైగా ఉన్న గ్రామంలో సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా కారణంగా లో ఓల్టేజ్‌తో విద్యుత్ బల్బులు కూడా సరిగా వెలగక మిగిలిన గృహోపకరణాలు పనిచేయడం లేదని వాపోతున్నారు. హై ఓల్టేజ్ సరఫరా అయ్యేటప్పుడు ఇవే గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నమ్మివానిపేట గ్రామానికి త్రీ ఫేజ్‌తో కూడిన నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ సైనికుల పింఛన్ స్కీమ్ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైనిక సంక్షేమ అధికారులు

తగరపువలస: పింఛన్ స్కీమ్‌ను 2 నుంచి 10 శాతానికి పెంచాలని మాజీ సైనికులు పలువురు కోరారు. మాజీ సైనికుల సమస్యలపై జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం (భీమిలి) ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రీయ సైనికబోర్డు కార్యదర్శి (న్యూఢిల్లీ) కమొడోర్ హెచ్‌పీ సింగ్, ఏపీ సైనికబోర్డు సంచాలకుడు, విశిష్ట సేవా మెడల్ గ్రహీత బ్రిగేడియర్ వి.వి.వెంకటరెడ్డి మాట్లాడారు. అనంతరం మాజీ సైనికులు మాట్లాడుతూ మల్కాపురం కల్యాణిలో లభించే సేవలు ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా లభిస్తున్నందున వాటిని తమకు దగ్గరలో ఉన్న సంగివలస ఎన్ఆర్ఐలో అందించేలా చూడాలని కోరారు. క్యాంటీన్‌లో లభించే వస్తువులను తమకు సమీపంలోని భీమిలి ఐఎన్ఎస్ - కళింగలో అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో మాజీ సైనికులకు అందుతున్న రిజర్వేషన్లు, ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలను వివరించారు. సమావేశంలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల సైనిక సంక్షేమ అధికారులు జి.సత్యానందం, కృష్ణారావు, శైలజ, పి.సత్యప్రసాద్, స్థానిక సంఘం అధ్యక్షుడు కేజీ రెడ్డి, కార్యదర్శి సీటీ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, మాజీ సైనికులు నానిచిట్టి, సరగడ సూరిబాబు, రవిశేఖర్, నేదూరి శ్రీనివాసరెడ్డి, నందిక రమణ, చేట్ల గురుమూర్తి రెడ్డి, కొసన అప్పలనరసయ్య, చిల్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

- జీవీఎంసీ జోన్ - 2 కమిషనర్ కనక మహాలక్ష్మి



స్వతంత్రనగర్ వార్డు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: ఇటీవల జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కొట్యాడ కనక మహాలక్ష్మి జోన్‌లోని వివిధ ప్రాంతాల్లో శనివారం విస్తృతంగా పర్యటించారు. శానిటేషన్, మరుగుదొడ్లు, సచివాలయాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్వతంత్రనగర్ పరిసర ప్రాంతాల్లోని 67, 68, 69వ నంబరు సచివాలయాలు పరిశీలించారు. అక్కడ కార్యదర్శుల హాజరు, మూమెంట్ రిజిస్టర్ పరిశీలించారు. ఎంత మంది ఆఫీసులో ఉన్నారు... ఆఫీసులో లేని వారు బయటకు ఎందుకు వెళ్లారు... తదితర అంశాలు ఆరా తీశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు బాధ్యతాయుతంగా అందించాలని కోరారు. అలాగే మధురవాడ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం పరిసర ప్రాంతాల్లో స్వీపింగ్ పనులు, మరుగుదొడ్ల పరిశుభ్రత పరిశీలించారు. ఆమెతోపాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై వరి నూర్పుతో ఇబ్బందులు



రోడ్డుపై వరి చేను నూరుస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో రోడ్డుపై వరి పంట నూరుస్తున్నారు. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోని వాటర్ వర్క్స్ - ఆనందపురం బీటీ రోడ్డుపై ఏనుగుపాలెం సమీపాన కోసిన వరి పనలను వేసి నూరుస్తున్నారు. ఈ రోడ్డుపై ఆనందపురం, మధురవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. రోడ్డుపై వరి నూర్పు వేయడం వల్ల బైక్‌లు స్కిడ్ అయ్యి ప్రమాదాలకు గురవుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై వరి నూర్పు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా నో బ్యాగ్ డే సంబరాలు



తయారు చేసిన వస్తువులతో విద్యార్థులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాగితపు వ్యర్థాలు, మట్టి, చింతపిక్కలు, చీపురు పుల్లలు ఉపయోగించి పక్షి గూళ్లు, తంతితపాలా పెట్టె, జంతువుల బొమ్మలు, ఫ్రేమ్‌లు, వివిధ రకాల చిత్రాలు తయారు చేశారు. ఆకులతో వర్ణమాల, గుణింతాలు, పద పట్టికలు తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు విద్యార్థులకు సహకరించారు.

క్రీడాకారులకు అండగా నాగమయ్యపాలెం ఆటస్థలం

- వినియోగించుకుంటున్న 15 పంచాయతీల యువకులు
- అభివృద్ధి చేస్తే మరింతగా ప్రయోజనకరం



క్రీడాకారులు వినియోగించుకుంటున్న విశాలమైన పెదనాగమయ్యపాలెం క్రీడామైదానం

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలోని విశాలమైన ఆటస్థలం యువ క్రీడాకారులకు అండగా నిలుస్తోంది. మిగిలిన 15 పంచాయతీల్లో ఇంతటి విశాలమైన ఆటస్థలం ఎక్కడా లేదు. దీంతో యువత ఆటవిడుపులకు తీర ప్రాంతంలో విశాలమైన ఈ ఆటస్థలంలో వాలిపోతున్నారు. ముఖ్యంగా పెదనాగమయ్యపాలెం, అన్నవరం, చిప్పాడ, అమనాం, మూలకుద్దు, చెరకుపల్లి, గుడివాడ పంచాయతీల్లో తరచూ రోజుల తరబడి క్రికెట్ టోర్నమెంట్లు ఇక్కడే నిర్వహిస్తుంటారు. విశాలమైన క్రీడా మైదానం కారణంగా మిగిలిన పంచాయతీల క్రీడాకారులు కూడా తరచూ నాగమయ్యపాలెం వస్తుంటారు. మిగిలిన క్రీడలకు కూడా ఈ మైదానం అనువుగా ఉంది. ఒకవైపు సముద్రం, మరొకవైపు గోస్తనీ ఉప్పుటేరు, ఇసుక దిబ్బలతో ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇంతలా క్రీడాకారులకు అందుబాటులో ఉన్న ఈ మైదానంలో నిర్వహణ లేకపోవడంతో ఎత్తుపల్లాలతో అడ్డదిడ్డంగా ఉంటుందని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం పనుల క్రింద ఇప్పటి వరకు ఈ ఆటస్థలంలో రూ.8 లక్షల విలువైన పనులు నిర్వహించారు. అయినప్పటికీ పిచ్ నిర్మాణం కుదరడం లేదని అంటున్నారు. వర్షం పడితే నీరు ఆటస్థలంలో నిలిచిపోవడం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో తరచూ వీటిని శుభ్రం చేసుకోవడానికి సమయం పడుతుందని అంటున్నారు. తీరప్రాంత పంచాయతీల్లోని వనరులు వినియోగించుకుంటున్న దివీస్ లేబొరేటరీ యాజమాన్యం కేవలం ఆటస్థలం చుట్టూ సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందని ఇక్కడి క్రీడాకారులు అంటున్నారు. సరైన ప్రమాణాలతో పెదనాగమయ్యపాలెం క్రీడామైదానాన్ని తీర్చిదిద్దానికి ప్రభుత్వంతోపాటు దివీస్ లేబొరేటరీ సహకారం అందించాలని భీమిలి గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.



మైదానంలోని క్రికెట్ పిచ్ వద్ద నిలిచిన వర్షపు నీరు

పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరించాలి

సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్

సింహాచలం: పంచగ్రామాల భూసమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. భూసమస్య పరిష్కరించాలని శనివారం సింహాచలం మార్కెట్ కూడలిలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కొద్ది రోజుల్లోనే చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని, ఇంకెన్నాళ్లు వేచి ఉండాలన్నారు. సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చే మూడున్నర సంవత్సరాలు గడిచినా నేటికి సమస్య పరిష్కారం కాలేదని దుయ్యబట్టారు. సింహాచలం దేవస్థానానికి 1996-97లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు తప్పా ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. పంచగ్రామాల్లో కనీసం ఇళ్ల మరమ్మతులు చేసుకోలేని పరిస్థితి నెలకుందని ఆవేదన వ్యక్తం చేశారు. యధాతథ స్థితి కొనసాగాలని హైకోర్టు తాత్కాలిక ఆర్డర్ ఉందని, దాని ప్రకారం ఇళ్లు, స్థలాలు రిపేర్లు, క్రయవిక్రయాలు, నిర్మాణాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ, సంఘం నాయకులు బి.రమణి, వీబీఎస్.ప్రతాప్, ఎస్.సూర్యారావు, బి.అరుణకుమార్, ఎస్.వి.రమణ, ఎం. రామభద్రరావు, ప్రసాద్ పాల్గొన్నారు.